పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- నేటి ఎన్నికలకు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

ఆత్మకూరు(ఎం), మే 12 : భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి నేడు జరుగనున్న ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే సిబ్బంది చేరుకుని ఏర్పాట్లు పూర్తిచేసుకున్నారు. ఆత్మకూర్(ఎం) మండలంలో 37 పోలింగ్ కేంద్రాలకు గానూ 148 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నిరంజన్‌వలీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 50 మంది ప్రత్యేక పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్ఐ నాగరాజు వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి విలియం కేరీ చెప్పారు.

రాజాపేట : మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తాసీల్దార్ దామోదర్ తెలిపారు. మండలంలో మొత్తం 29,700 ఓట్లలో 14,721 పురుషులు, 14,979 మహిళలు ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

తుర్కపల్లి : మండలంలో 39 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. 27,292 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 13,536, మహిళలు 13,756 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో, పట్టణంలో మొత్తం 43,269 ఓటర్లకు 50 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని చెప్పారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

అడ్డగూడూరు : మండలంలోని 3 రూట్లలో 30 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల సహాయ అధికారి శేషగిరిరావు తెలిపారు. మొత్తం 22,769 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. వీరిలో పురుషులు 11,204, మహిళలు 11,565 ఉన్నట్లు తెలిపారు.

మోత్కూరు : మండలంలో 31 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలో 17, గ్రామాల్లో 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రాంప్రసాద్ తెలిపారు. ఎన్నికలు సజావుగా ముగిసేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

బొమ్మలరామారం : మండలంలో 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 29,022 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తాసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

వలిగొండ : మండలాన్ని 7 సెక్టార్‌ర్లుగా విభజించి ఒక్కో సెక్టార్‌కు సెక్టార్ అధికారిని నియమించామని, ఓటర్ల కోసం గ్రామాల వారీగా మొత్తం 65 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు సహాయ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో నలుగురు విధులు నిర్వహిస్తారని, ఎన్నికల సిబ్బందికి సహకరించడానికి బీఎల్ఓ, పంచాయతీ కార్యదర్శితోపాటు పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. మండల వ్యాప్తంగా 51,400 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు.

మోటకొండూర్ : మండలంలో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఇందిర తెలిపారు. మొత్తం 20,710 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా 59 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారితోపాటు అవసరమైన సిబ్బందిని నియమించారు. ఎన్నికల సరళిని పరిశీలించేందుకు సీసీ కెమెరాలు బిగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ సిబ్బందితోపాటు పెట్రోలింగ్ వాహనాలు, స్టైకింగ్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు.

భువనగిరిలో సామగ్రితో బస్సు ఎక్కుతున్న పోలింగ్ సిబ్బంది

భువనగిరిలో ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది

భువనగిరిలో స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు తీసుకొస్తున్న ఎన్నికల సిబ్బంది

రాజాపేట : జాల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న అధికారులు

చౌటుప్పల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పోలింగ్ సామగ్రితో వస్తున్న సిబ్బంది

ఆత్మకూరు(ఎం)లోని పోలింగ్ కేంద్రం వద్ద లైట్లు ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, సిబ్బంది

ఆత్మకూరు(ఎం) పోలింగ్ కేంద్రానికి వస్తున్న ఎన్నికల అధికారులు, సిబ్బంది

ఆత్మకూర్(ఎం) : పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నిరంజన్ వలీ

ఆత్మకూర్(ఎం) : ఎన్నికల సామగ్రితో పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్న సిబ్బంది

ఆత్మకూర్(ఎం) : పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న పోలీసులు

అడ్డగూడూరులో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

వలిగొండలో పోలింగ్ ఏర్పాట్లను సరిచూసుకుంటున్న సిబ్బంది

రామన్నపేట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

వలిగొండలో బస్సు దిగి పోలింగ్ స్టేషన్‌కు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

చౌటుప్పల్‌లోని ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి ఎన్నికల సామగ్రితో వస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్టలో సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే12 : పంచనారసింహుడి క్షేత్రమైన యాదగిరిగుట్ట దేవస్థానం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో నారసింహ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, తిరుమాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు భక్తులతో సందడిగా మారాయి. నిత్య తిరుకల్యాణం, సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ధర్మదర్శానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు తిరువీధి, దర్బార్ సేవల్లో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను వైభవంగా నిర్వహించారు. స్వామివారి ప్రధానాలయంలో జగద్గురు రామానుజాచార్య తిరునక్షత్రోత్సవం అత్యంత వైభవంగా సాగింది. స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి పుర ప్పాట్ సేవ చేపట్టారు. అనుబంధ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్య జయంత్యోత్సవాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అభిషేకం నిర్వహించారు. స్వామివారిని సుమారు 40 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 57,76,291ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ మాఢ వీధుల్లో భక్తుల సందడి

సత్తయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 12 : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సతీమణి బీర్ల అనిత తండ్రి సుబ్బారి సత్తయ్య శనివారం మండలంలోని చందుపట్లలో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో జరుగగా కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొని సంతాపం తెలిపారు. సత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. కాగా, సత్తయ్యకు కుమారులు లేకపోవడంతో కూతురు అనిత తండ్రి చితికి తలకొరివి పెట్టింది.

సత్తయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

క్యామ మల్లేశ్ గెలుపు ఖాయం

- మదర్ డైయిరీ డైరెక్టర్ సోమిరెడ్డి

ఆలేరు రూరల్ : కొలనుపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మదర్ డైయిరీ డైరెక్టర్ సోమిరెడ్డి

ఆలేరు రూరల్, మే 12 : భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయమని మదర్ డెయిరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొలనుపాకలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మల్లేశ్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జంగ స్వామి, నాయకులు మామిడాల అంజయ్య, ఆరె మల్లేశ్, చిరబోయిన మల్లేశ్, బెదరబోయిన శంకర్, గంధమల్ల రవి, రాజబోయిన కొండల్, దూడల భాగయ్య, మిట్టపల్లి వీరస్వామి, తొడేటి నరేందర్, ఎదునూరి భాస్కర్, సొంటెం ప్రవీణ్, తేరాల శంకర్, నిమ్మల శంకర్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు భారీ బందోబస్తు : ఎస్ఐ

భూదాన్‌పోచంపల్లి, మే 12 : ఎన్నికలు సజావుగా జరిగేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నేడు జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా భువనగిరి ఏసీపీ రవికిరణ్, చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ బలగాలతో 50 పోలింగ్ స్టేషన్లలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 8 మంది ఎస్ఐలతో ఆరు రూట్లలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సైకిల్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలైన పిలాయిపల్లి, శివారెడ్డిగూడెం, కప్రాయపల్లిలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా 63 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఎన్నికల బందోబస్తుకు సిద్ధంగా పోలీసులు

వ్యక్తి ఆత్మహత్య

తుర్కపల్లి, మే12 : వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పిడుగు అశోక్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 3 ఏండ్ల క్రితం అశోక్ భార్య లావణ్య మృతి చెందగా, మనస్తాపానికి గురైన అశోక్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తన ఇద్దరు కూతుళ్లు వేసవి సెలవుల కోసం అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం ఉరేసుకున్నాడు. ఇరుగుపొరుగు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టారు. మృతుడి అక్క శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

ఓటరు టర్నవుట్ నివేదికలు సకాలంలో అందించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జండగే

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జండగే

భువనగిరి కలెక్టరేట్, మే 12 : పోలింగ్ సందర్భంగా ఓటరు టర్నవుట్ నివేదికలు సకాలంలో అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. ఆదివారం అధికారులతో సమావేశమై 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన పోలింగ్ సరళి, ఓటర్ టర్నవుట్, ఈఏఎం రిప్లేస్‌మెంట్, అబ్జర్వర్ టీమ్ రిపోర్టులను సకాలంలో సేకరించాలని, ఓటింగ్ పర్సంటేజ్ తదితర వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ బెన్ షాలోమ్, నోడల్ అధికారులు వెంకటేశ్వర్లు, సునంద, సాహితి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు నాగేశ్వరాచారి, రామారావు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

బొమ్మలరామారం, మే 12 : మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిలువేరు మహేశ్ ఆదివారం తెలిపారు. ఎంపీసీలో 40సీట్లు, బైపీసీ 40, సీఈసీ 40, ఎంఈసీలో 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు TSMODELSCHOOLS.COM వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులకు ఈ నెల 30 వరకు గడువు ఉన్నట్లు తెలిపారు.

గురుకుల విద్యార్థినికి ఐఐఎంలో సీటు

బీబీనగర్, మే 12 : మండలంలోని రాఘవాపురం పరిధిలో గల సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని భావన ప్రతిష్టాత్మకమైన మూడు ఐఐఎం(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్)లలో సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాండురంగ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ఐఐఎం కాశీపూర్, భోద్‌గయ, జమ్మూలోని ఇన్‌స్టిట్యూట్‌లలో సీటు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని భావనను, ఆమె సీటు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్‌గౌడ్

రామన్నపేట, మే 12 : ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగోని వెంకటేశ్‌గౌడ్ సూచించారు. ఆదివారం స్థానికంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దేశం హితం కోసం స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకొని సమర్థవంతమైన నాయకుణ్ని ఎన్నుకోవాలని కోరారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవం

కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బీబీనగర్, మే 12 : మండలంలోని జైనపల్లిలో గల హనుమాన్ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు ఆంజనేయశర్మ, కృష్ణమూర్తిశర్మ, విజయ్‌కుమార్ మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. దాతలు సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు మందుగుల చంద్రశేఖర్‌గుప్తా, మాజీ సర్పంచులు తంతరపల్లి అంజయ్యగౌడ్, బెజ్జంకి నరేందర్‌రెడ్డి, మొరిగాడి బాలమల్లేశ్‌గౌడ్, నాయకులు బాలపోచయ్య, మధుగౌడ్, గణేశ్, శ్రీనివాస్, రమేశ్, భూపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, చంద్రమౌళిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణగౌడ్, సుమంత్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అమరలింగంగౌడ్, రాజు, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.